క్లుప్తంగా

నేడు శివాలయ భూముల కౌలు వేలం

పలమనేరు: పట్టణంలోని శివాలయానికి చెందిన గంగవరం మండలం రొంటకుంట్ల గ్రామంలోని భూములకు ఈనెల 15న స్థానిక ఆలయంలో మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ కమలాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు రూ.1000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, ఈ వేలంలో నాలుగు సర్వే నంబర్లకు సంబంధించిన 7.81 ఎకరాలను కౌలుకు ఇవ్వనున్నట్టు తెలియజేశారు.

నేడు, రేపు శిక్షణ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 25 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు మంగళ, బుధవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ బాలాజి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిపాలన, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

సదుంలో..

సదుం: పంచాయతీ పరిపాలనపై మంగళవారం ఉదయం 10.30 శిక్షణ ఇవ్వనున్నట్టు ఈఓపీఆర్డీ వరప్రసాద్ తెలిపారు. ప్రతి పంచాయతీకి వైస్ సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఖాజీగా మహమ్మద్ ఏజాజ్



పుంగనూరు: పుంగనూరు మండల ముస్లిం మైనారిటీలకు సంబంధించి ప్రభుత్వ ఖాజీగా డి.మహమ్మద్ ఏజాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పదేళ్లపాటు ఖాజీగా కొనసాగుతారు. అలాగే ముస్లింలకు నిఖా (వివాహం) చేసే అధికారం ఆయనకు ప్రభుత్వం కల్పించింది.

సచివాలయాల్లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు



మెడికల్ క్యాంపుపై సచివాలయం వద్ద తెలియజేస్తున్న వైద్యులు

గుడిపాల: తుపాను నేపథ్యంలో మెడికల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. వర్షాలు అధికంగా ఉండడం వలన ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేశామన్నారు. సోమవారం పాపసముద్రం, గుడిపాల సచివాలయాల పరిధిలో ముందస్తుగా వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రతి సచివాలయంలోనూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 24 గంటలపాటు అంటుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ సంధ్య 87900 33456, హెల్త్ అసిస్టెంట్ 98496 64426, స్టాఫ్ నర్సులు 95502 79579, 99080 13900, 99850 99854ను సంప్రదించాలన్నారు.


ఉచిత కంటి ఆపరేషన్లకు 15 మంది ఎంపిక



రోగులకు పరీక్ష చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 15 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 32 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికై న వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బంగారుపాళెంలో వర్షం



బంగారుపాళెం: అల్పపీడనం ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు చిరుజల్లులు కురిశాయి. దీంతో రహదారుల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు సాగించుకునే చిరువ్యాపారులు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, ఇతర పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ హెచ్చరించారు.

మద్యం షాపులన్నీ

‘పచ్చ’ సిండికేట్లకే..!

- వైఎస్సార్‌సీపీ నేతలకు వచ్చిన రెండు షాపులనూ టీడీపీ కబ్జా..!
- మూడురోజుల నుంచి సాగిన పచ్చ తమ్ముళ్ల బెదిరింపులు
- అన్ని మండలాల్లోనూ సిండికేట్ అయిన టీడీపీ బ్యాచ్
- ప్రభుత్వ ధరలు కాదు.. ఇక సిండికేట్లు చెప్పిందే రేటు..?
- ఇదీ పలమనేరు ఎక్సైజ్ పరిధిలో మద్యం షాపుల పరిస్థితి



మద్యం షాపు(ఫైల్)

పలమనేరు: అంతా అనుకున్నట్టుగానే అయ్యింది. ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపులో అన్ని షాపులనూ పచ్చ సిండికేట్ బెదిరింపులతో కైవసం చేసుకుంది. షాపులకు దరఖాస్తు చేసుకున్న వారిని మూడురోజుల నుంచి బెదిరింపులకు దిగింది. షాపులొచ్చినా తమకే ఇవ్వాలంటూ అగ్రిమెంట్లు సైతం చేసుకుంది. దీంతో పలమనేరు ఎక్సైజ్ పరిధిలోని మొత్తం 13 షాపుల్లో 11 పచ్చనేతలకు, కేవలం రెండు మాత్రం వైఎస్సార్‌సీపీ వారికి దక్కాయి. అయితే ఈ ఇద్దరి నుంచి సైతం ముందుగానే బెదిరించి అగ్రిమెంట్లు చేసుకున్నారు. దీంతో అన్ని ప్రైవేటు మద్యం దుకాణాలు పచ్చనేతల గుప్పిట్లోకి వెళ్లాయి. అప్లికేషన్లు వేసినప్పటి నుంచి ఆయా మండలాల పచ్చనేతలు సిండికేట్ అవడం విదితమే. బెదిరింపులు, వార్నింగ్‌లతో షాపులన్నీ పచ్చనేతల చేతుల్లోకి వెళ్లాయి.

ఇవిగో సాక్ష్యాలు

పెద్దపంజాణి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు నగిరేపల్లి క్రిష్టారెడ్డి గంగవరానికి సంబంధించి మూడు షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇది తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మనుషులు ఆయన్ను బెదిరించి షాపులు క్రిష్టారెడ్డి పొందినా తామే నిర్వహిస్తామంటూ ఫోన్‌లో బెదిరించారు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆపై నియోజవర్గ ప్రజాప్రతినిధి నేరుగా క్రిష్టారెడ్డితో మాట్లాడి.. తన సోదరునికే షాపులు కావాలని, ఇబ్బందులు పడొద్దని ఒకింత వార్నింగ్ ధోరణిలో మాట్లాడారని బాధితుడు తెలిపారు. దీంతో విధిలేక తనకు షాపులు దక్కినా వారికే అప్పగిస్తూ అగ్రిమెంట్లు రాసిచ్చి డిపాజిట్ సొమ్మును తీసుకున్నాడు. సోమవారం ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లక్కీడ్రాలో గంగవరం షాపు క్రిష్టారెడ్డికే దక్కింది. అధికారికంగా ఆయన లైసెన్సుదారుడైనప్పటికీ టీడీపీ నేతలే షాపును నిర్వహించనుండటం గమనార్హం!

బైరెడ్డిపల్లె మండలంలో....

బైరెడ్డిపల్లె షాపులకు సంబంధించి గంగవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లుబాల దరఖాస్తు చేశారు. ఇతన్ని ఆ మండలానికి చెందిన టీడీపీ నేతలు బెదిరించి షాపులొచ్చినా తమకే ఇవ్వాలంటూ అగ్రిమెంట్ రాయించుకున్నారు. ఇలా ఉండగా కల్లుబాలకు బైరెడ్డిపల్లెకు చెందిన ఓ షాపు లాటరీలో దక్కింది. కానీ ఆ షాపును ఆ మండలానికి చెందిన పచ్చ సిండికేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది.

ఇక అంతా సిండికేటే.!

గతంలో ప్రైవేటు షాపుల్లో మద్యం విక్రయాలు సాగినప్పుడు జరిగిన సిండికేట్ యవ్వారమే మళ్లీ తెరపైకి వచ్చిందని ప్రస్తుతం లిక్కర్ షాపుల పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. గత టీడీపీ హయంలో ఇదే పలమనేరులో మద్యం సిండికేట్ కోసం ప్రత్యేకంగా ఓ ఆఫీసును సైతం ఏర్పాటు చేసి సిండికేట్ వ్యవహారాలను నడిపించడం మందుబాబుల దృష్టిపథంలో మెదులుతూనే ఉంది. ప్రభుత్వం రేట్లకు కాకుండా సిండికేట్ రేట్లతో మళ్లీ దోచుకుంటారని మందుబాబులు వాపోతున్నారు.

వీ.కోట మండలంలో ఆ పార్టీ వారిపైనే బెదిరింపులు

వీ.కోట షాపులకు సంబంధించి బంగారుపాళెంకు చెందిన కోకో ప్రకాష్‌నాయుడు అనే టీడీపీ నేత దరఖాస్తు చేశారు. దీంతో ఆ మండలానికి చెందిన అధికార పార్టీ సిండికేట్ ఆయన్ను ఫోన్‌లో బెదిరించింది. ఈ ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. చంద్రబాబు, లోకేష్ చెప్పినా ఆయా మండలాల్లో టీడీపీ వారికే మద్యం షాపులు దక్కాలంటూ ముందుగానే సిండికేట్ అయి టీడీపీ వేసిన స్కెచ్ ఫలించింది. నయానో భయానో బెదిరించి షాపుల్ని తమ వశం చేసుకున్నారు. ఇది విమర్శలకు తావిస్తోంది.

16న మండల సమావేశం

పలమనేరు: మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 16న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఖాదర్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

17న కుప్పంలో వాల్మీకి జయంతి

కుప్పం రూరల్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇదివరకు అధికారికంగా 17న వాల్మీకి జయంతి వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకుందన్నారు. కుప్పంలోని వాల్మీకి భవన్‌లో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. వాల్మీకి కులస్తులు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

20న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం

పలమనేరు: ఈనెల 20న జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బాపూజీ ఉద్యానవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అసోసియేషన్ నేతలు హరిక్రిష్ణ, నరేష్, శివ,రాజు, బాబు, రమణ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో కుప్పం విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

గౌతమి



సంతోష్ పునీత్‌కుమార్ మహీన్

కుప్పం: ప్రతిభ కనబరచిన విద్యార్థులు

కుప్పం రూరల్: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కళాశాల వైస్ చైర్మన్ శాంతానాగరాజు తెలిపారు. బీకాం (సీఏ)లో పి.వర్షిక 93 పాయింట్లు, బీఎస్సీ(ఎంపీజీ)లో భవాని 928 పాయింట్లు, బీబీఏలో ఎం.రాజేష్ 897పాయింట్లు, బీఎస్సీ(ఎంఎస్‌జీ)లో భువనేశ్వరి 878 పాయింట్లు, బీఎస్సీ (బీజెడ్‌సీ)లో ఎం.రేఖ 849 పాయింట్లు సాధించి కళాశాలల్లో మొదటి స్థానంలో నిలిచినట్లు ఆమె చెప్పారు. అలాగే కాస్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్‌లో అరుగురు విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను వైస్ చైర్మన్‌తోపాటు ప్రిన్సిపల్ సుధారాణి అభినందించారు.

గంగవరంలో మదర్ థెరిసా విద్యార్థులు..

గంగవరం: ఎస్వీయూ విడుదల చేసిన 4వ సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. బీబీఏలో మహీన్(9.33), పునీత్‌కుమార్(9.10), సంతోష్(9.09), బీఎస్సీలో గౌతమి(9.36), రోహిణి(9.05), బీసీఏలో తనూజ(9.7), అర్చన(8.82), బీకాంలో రక్షిత(8.84), కుసుమ(8.76), చైతన్య(8.74) జీఎస్‌జీపీఏ సాధించి కళాశాల స్థాయిలో టాపర్లు నిలిచారన్నారు. బీఎస్సీ, బీసీఏ, బీకాం, బీబీఏ 2వ సంవత్సరం 4వ సెమిస్టర్‌లో 210 డిస్టింక్షన్లు, 100 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు అభినందించారు.

ఐఆర్ఎం కళాశాల విద్యార్థులు..

కుప్పం: డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని ఐఆర్ఎం కళాశాల అధినేత దయానిధి తెలిపారు. బీకాం విద్యార్థిని తులసి 9.1, బీబీఏ విద్యార్థి హీనాకౌసర్ 8.7, బీఎస్సీ విభాగంలో త్రిష 8.2 పాయింట్లు సాధించారని తెలియజేశారు. విద్యార్థులను అభినందించారు.

చిత్తూరులో తుపాను అత్యవసర విభాగం

చిత్తూరు అర్బన్: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో చిత్తూరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్పొరేషన్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఇప్పటికే నగరంలో లోతట్టు ప్రాంతాలు, పెద్ద కాలువల్లో ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన సోమవారం మిట్టూరు, గంగినేని చెరువు మొరవ కాలువను పరిశీలించారు. కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణలు తొలగించేలా సంబంధిత వ్యక్తులకు సత్వరం నోటీసు జారీ చేయాలని ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

అసలే స్కూటీ.. ఇలా పోతారేంట్రా..?



గుడిపాల: అసలే అది బుల్లి స్కూటీ. ఇద్దరు ఎక్కితేనే కష్టం. అలాంటిది నలుగురు ఎక్కారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై లారీలు అధిక వేగంతో వెళుతుంటాయి.ఆ మార్గంలో డ్రైవింగ్ చేయడమే ఒక సాహసం. అలాంటిది మైనారిటీ కూడా తీరని బాలుడు మరో ముగ్గురిని వెనక కూర్చోపెట్టి ప్రయాణించాడు. నిత్యం వేగంగా వాహనాలు దూసుకెళ్లే హైవేలో ఇలా వెళ్లడం అత్యంత ప్రమాదకరమే. నంబర్ ప్లేట్ లేని ఈ స్కూటీపై ఎలా దూసుకుపోతున్నారో చూడండి.

వెంగంపల్లెలో దారి సమస్య పరిష్కారం



వివాదాస్పదమైన దారిని పరిశీలిస్తున్న తహసీల్దార్

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో వివాదాస్పదనమైన దారి సమస్యను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించి పరిష్కరించారు. వెంగంపల్లె, పరిసరాల గ్రామాల ప్రజలు సమీపంలోని పెద్ద అడవిలో పైభాగాన వెంకటేశ్వర స్వామి గుడిని నిర్మించారు. ప్రతి సంవత్సరం ఐదవ శనివారం వెంకటేశ్వరస్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. గుడికి వెళ్లడానికి దారి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దారికి ఇరువైపులా ఆక్రమించుకొన్న రైతులతో మాట్లాడి దారి వదలాలని సూచించారు. రైతులు సహకరించడంతో సర్వే చేయించి 35 అడుగుల వెడల్పుతో దారి ఏర్పాటు చేయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

తుపానుపై అప్రమత్తం

రొంపిచెర్ల: తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో తుపానుపై ఆయన సమీక్షించారు. మండలంలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడైనా చెరువులు, కుంటలు ప్రమాదస్థితికి చేరితే ముందుగానే గుర్తించాలన్నారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులందరూ రాత్రి పూట మండల కేంద్రంలోనే బస చేసి, తుపాను ప్రభావంపై పర్యవేక్షించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, డీటీ లోకేష్, ఎస్ఐ సుబ్బారెడ్డి, సీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్ కుమార్ నాయక్, కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం రూరల్: ఉద్యాన రైతులు తుపానుపై అప్రమత్తంగా ఉండాలని కుప్పం మండల ఉద్యానవన అధికారి డింపుప్రియ తెలిపారు. తుపాను ప్రభావంతో వర్షాలు పడనుండడంతో రైతులు పొలాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. టమాట రైతులు మొక్కలకు కర్రల ఊతం ఏర్పాటు చేసుకోవాలని, కోతకు వచ్చిన టమాటాలను ముందుగానే కోసి పెట్టుకోవాలన్నారు. వర్షంలో కోత కోయరాదన్నారు. మచ్చ తెగులు ఆశించకుండా 2.5 గ్రాముల డైత్రెన్ ఎం.45, ఒక గ్రాము కార్బెండిజం లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే చామంతి, బంతి, అరటి, బొప్పాయి తోటల్లోనూ నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు.

మానవ అక్రమ రవాణాకు చెక్ పెడదాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: మానవ అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని గ్రేట్ విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జీవీఎస్ బాబు అన్నారు. మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన పోస్టర్లను అవిష్కరించి ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణాలో ఏపీ మూడవ స్థానంలో ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పుట్టిన శిశువు మొదలు వయోభేదం లేకుండా మానవ అక్రమ రవాణా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై 19న విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, విద్యావేత్త రఘునాథ్, వీఆర్వో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటు.. పశువులకు చేటు

- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- దోమకాటుతో పాల ఉత్పత్తి తగ్గుముఖం
- దోమల కట్టడికి చర్యలు తప్పనిసరి



పాడి ఆవుకు వైద్యం చేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సిబ్బంది

ఐరాల: వర్షాకాలంలో మనుషులే కాదు పశువులు కూడా దోమకాటుకు గురవుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని ముందుగా అరికడితే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు రోగాల బారిన పడడం కాకుండా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోందని ఐరాల మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచిస్తున్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నియోజకవర్గంలో అధికశాతం రైతులు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులకు గొంతు వాపు వ్యాధి, దొమ్మ వ్యాధి, గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పశువైద్యాధికారి సూచిస్తున్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే జబ్బు గొంతువాపు వ్యాధి. దీనిని గురకవ్యాధి అనికూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు దోమలు, సూక్ష్మ జీవుల వలన వస్తుంది. ఇది అంటువ్యాధిగా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. కలుషితమైన నీరు, మేత ద్వారా రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధి బారిన పడి కంటి నుంచి నీరు, నోటి నుంచి చొంగకారస్తూ, గురక, శ్వాస పీల్చడం కష్టతరంగా మారుతుంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పీల్చడం ఇబ్బందిపడుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు చేరి గొంతువాపు వస్తుంది.

చికిత్స

వర్షాకాలం ముందుగా జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేసుకోవాలి. వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు ఇంజక్షన్లు ఇవ్వాలి. మిగిలిన పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సమీప పశువుల వైద్యాధికారిని సంప్రదించి తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలి.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి దోమకాటు, వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి ద్వారా వచ్చే వ్యాధి. తల్లిపాల ద్వారా దూడలకు వస్తుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో విరివిగా పశువులకు గాలికుంటువ్యాధి సోకుతుంది. గిట్టలు ఉన్న ప్రతి జీవి ఈ అంటువ్యాధి బారిన పడతాయి. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలో, గిట్ల మధ్య పుండ్లు పడి పశువులు నడవలేని పరిస్థితిని ఎదుర్కొంటాయి. మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఈ వ్యాధి పశువులకు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువుకు గిట్ట మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారి నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం చేత పశువులు మేత మేయలేక పోతాయి. నీరసంగా ఉంటాయి. వర్షాకాలంలో నేలలు తడిగా ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఎద్దుల్లో అయితే రోగ నిరోధకశక్తి తగ్గి అలసటకు గురై నీరసించిపోతాయి.

చికిత్స

వ్యాధి సోకిన పవువును మంద నుంచి ముందుగా వేరుచేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె పూయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వాడితే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్లలో కట్టేసిన తరువాత దోమ తెరలకు రంధ్రాలు లేకుండా చూడాలి. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల కొట్టం చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజు శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

దోమకాటుతో సమస్యలు

పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో మేత సరిగా తీసుకపోవడంతో పాటు ఆకలి మందగించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుంది. పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజు రోజుకూ బలహీనపడుతుంది. దోమలు కుట్టిన చోట చర్మం దురద వచ్చి పుండ్లు పడతాయి. పశువులకు మేత వేసే ప్రాంతం శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోదు.

పశువు ప్రాణానికే ప్రమాదం



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల వల్ల పశువులకు జ్వరం, అలర్జీ అధికంగా వస్తాయి. దీని వల్ల పాల దిగుబడిపై చూపడమే కాకుండా పశుప్రాణాలను హరిస్తాయి. దోమల వల్ల ఎలాంటి నష్టం సరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– పద్మావతి, పశుసంవర్ధక శాఖ ఏడీ, ఐరాల